
సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 1 । జనవరి । 2025





లక్ష్యం చేరుకుంటాం..


కొత్త సంవత్సరంలో ఉద్యోగం, ఉపాధి సాధనే ధ్యేయమంటున్న యువత

- గతేడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడంలో వెనుకబాటు
- సోషల్ మీడియా వినియోగంలో తగ్గేదేలే..
- సామాజిక సేవపై మాత్రం అనాసక్తి..
- 'సాక్షి' సర్వేలో యువత మనోగతం


సాక్షి నెట్‌వర్క్ : నూతన సంవత్సర వేళ యువత మనోభావాలను తెలుసుకునేందుకు 'సాక్షి' ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా యువత నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటి అమలు.. ఈ ఏడాది ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.. వాటి కోసం ఏర్పాటు చేసుకున్న ప్రణాళిక.. సెల్‌ఫోన్ వాడకంపై ఈ సర్వే సాగింది.




గత సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారా..?



2. నూతన సంవత్సరం (2025)లో ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు?



3. సోషల్ మీడియాలో మీరు గడిపే సమయం..?



సర్వే శాంపిల్స్ ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాల నుంచి 1500 మంది 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సున్న యువతీ యువకులను ఈ సర్వేలో భాగస్వాములను చేశాం. వారిలో 900 మంది యువకులు, 600మంది యువతులు ఉన్నారు.

అనుకున్నది ఘనం.. అమలు స్వల్పం

గత సంవత్సరం (2024) ప్రారంభం రోజున యువత తీసుకున్న నిర్ణయాలు ఎంతో ఘనంగా ఉన్నా.. వాటిని అమలు చేయడంలో మాత్రం వెనుబడి పోయింది. ప్రత్యేకంగా లక్ష్యాలను నిర్దేశించుకోలేదని.. అనుకున్న వాటిలో కొంతమేర సాధించామని వెల్లడించారు. ఇక ఈ నూతన సంవత్సరంలో మాత్రం ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలని.. ప్రభుత్వ, ప్రైవేట్ ఏదైనా ఫర్వాలేదని చెప్పుకొచ్చారు. ఉద్యోగం సాధించలేని పక్షంలో స్వయం ఉపాధి చూసుకుంటామని దృఢంగా చెప్పడం ఆసక్తి కలిగించింది. కానీ.. సామాజిక సేవ చేయడానికి మాత్రం యువత పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇక మొబైల్‌తో గడిపే సమయం గతం (2023) కంటే ఎక్కువైందని పలువురు మొహమాటపడుతూ చెప్పారు.

యాదగిరి క్షేత్రంలో ధనుర్మాస వేడుకలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి, సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు పాశురాలను పఠించారు. ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణుపుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి.





• న్యూ జోష్



నూతన సంవత్సరం సందర్భంగా భువనగిరి పట్టణంలోని ఓ కళాశాలలో విద్యార్థినుల ఆనందోత్సాహం

• కొత్త సంవత్సరానికి స్వాగతం



భువనగిరి పట్టణంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గు వేస్తున్న యువతులు

• యేసుక్రీస్తును ప్రార్థిస్తూ..



భువనగిరి పట్టణంలోని మన్నా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



- విద్య, వైద్యం మెరుగునకు కృషి
- అర్హులకు పథకాలు అందిస్తాం
- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో రాష్ట్రంలోనే జిల్లా నంబర్ వన్

నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ హనుమంతరావుతో 'సాక్షి' ఇంటర్వ్యూ

సాక్షి,యాదాద్రి: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రాధాన్యమని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, పెంచిన 40 శాతం మెస్‌చార్జీల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగంతో కలిసి ముందుకు సాగుతామని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్రతిరోజు వైద్యులతో జూమ్ మీటింగ్

నార్మల్ డెలివరీల సంఖ్య పెరిగేలా వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేస్తాం. సిజేరియన్‌ల సంఖ్య తగ్గించే ప్రత్యేక కార్యాచరణ చేపడుతాం. ప్రస్తుతం ప్రతిరోజు ఉదయం 8.55 గంటలకు వైద్యులతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్నాం. దీంతో సకాలంలో వైద్యుల హాజరు పెరిగింది. అదేవిధంగా ఆస్పత్రికి వచ్చే ఓపీ రోగులకు అందించే సేవలను గుర్తించగలుగుతున్నాం. రోగులతో నేరుగా మాట్లాడుతున్నాం. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నాం.

పనుల ప్రగతిని ముందుకు తీసుకెళ్తాం

ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వనుంది. ఇప్పటికే ఇందిరమ్మ లబ్ధిదారుల సర్వే 91 శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను పారదర్శకంగా ఎంపిక చేసి లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తాం. జిల్లాలో మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, పలు ఇంజనీరింగ్ విభాగాల్లో మంజూరైన నిధులతో పనుల ప్రగతిని ముందుకు తీసుకెళ్తాం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ

హాస్టళ్లను విరివిగా తనిఖీ చేస్తున్నాం. హాస్టళ్లలో రాత్రి నిద్ర చేస్తున్నాం. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకాధికారులను నియమించి నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం ఇటీవల 40 శాతం మెస్ చార్జీలు పెంచింది. పెంచిన చార్జీల ప్రకారం మెనూ అమలయ్యేలా ప్రత్యేక చర్యలు చేపడుతాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. అదేవిధంగా జిల్లాలో పాల దిగుబడి మరింత పెంచే విధంగా పాడి పశువుల కొనుగోలుకు మహిళలకు రుణాలు ఇస్తాం.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

రైతులకు లాభసాటిగా ఉండే ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తాం. రైతులు ఒక్కసారి ఆయిల్ పామ్ సాగు చేస్తే 30 ఏళ్ల ఆదాయం వస్తుంది. ఈ సాగు కోసం రైతులకు రాయితీలు ఇస్తున్నాం.

పోలీసులకు సేవా పతకాలు

భువనగిరిటౌన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులకు తెలంగాణ ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే గ్యాలంటరీ అవార్డుల మాదిరిగానే తెలంగాణ సర్కార్ అత్యుత్తమ సేవలందించే పోలీస్ అధికారులకు గత కొన్నేళ్లుగా ఈ పతకాలు అందిస్తోంది. ఈమేరకు మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. యాదాద్రి భువనగిరి జోన్ హెడ్ క్వాటర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్(759) కె. సురేందర్‌కు మహోన్నత సేవా పతకం, ఏఆర్‌ఎస్‌ఐ సీహెచ్ శివకుమార్, ఏఆర్ ఎస్‌ఐ ఎండీ ఎక్బాల్‌పాషా, ఏఆర్ ఎస్‌ఐ డి.నాగరాజు, ఆర్‌ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పీవీ శ్రీనివాసులుకు సేవా పతకాలు ప్రకటించారు.

13మందికి పోస్టింగ్

భువనగిరిటౌన్: రెవెన్యూ శాఖలో 13 మంది జూనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఇచ్చారు. భువనగిరి చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో ఇద్దరు చొప్పున మొత్తం నలుగురికి, వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో పది మందికి పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైతు సంఘాన్ని సందర్శించిన జర్మని సభ్యులు



జర్మని సభ్యులను సన్మానిస్తున్న రైతులు

మోత్కూరు: మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలోని శ్రీ మత్స్యగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని మంగళవారం జర్మని కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి వ్యవసాయ పద్ధతులు రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మదర్ థెరిస్సా స్వచ్ఛంద సంస్థ ద్వారా వ్యవసాయ పనిముట్లతో పాటు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం రైతు సంఘం అధ్యక్షులు వల్లపు సైదులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో జర్మనీ బృందం సభ్యులు డాక్టర్ గ్లాజర్, థామస్, ప్రీస్, ఈవా, అనికా, జూలియన్, రాజు, మాజీ సర్పంచ్‌లు మర్రిపల్లి యాదయ్య, అంతటి నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సస్పెన్షన్

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజగోపాల్ సస్పెండ్ అయ్యారు. ఈమేరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఇటీవల ఇక్కడ పని చేసే వైద్యురాలు మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ విచారణకు ఆదేశించారు. ఆస్పత్రి సిబ్బందిని విచారించే గదిలో రాజగోపాల్ సీసీకెమెరాలు అమర్చి వాటిని తన సెల్‌ఫోన్‌కు అనుసంధానించుకొని విచారణంతా వింటున్నట్లు గుర్తించారు. ఈమేరకు రాజగోపాల్‌ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



యాదగిరిగుట్టలో ప్రత్యేక ఏర్పాట్లు

- నూతన సంవత్సరం మొదటిరోజు భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఈఓ వెల్లడి



విద్యుత్ కాంతుల వెలుగుల్లో యాదగిరిగుట్ట ఆలయం

యాదగిరిగుట్ట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు అధికంగా రానున్న నేపథ్యంలో ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వేకువజామునే స్వామివారికి సుప్రభాతం, అభిషేకం, సహస్రనామార్చన వంటి పూజలు పూర్తిచేసి, 7గంటలకు భక్తులకు దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్ రావు మంగళవారం 'సాక్షి'కి వెల్లడించారు. భక్తులకు రద్దీకి అనుగుణంగా లడ్డూ, పులిహోర ప్రసాదాలను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానాలయ ముఖ మండపం, గర్భాలయ ముఖ ద్వారం వంటి ప్రాంతాల్లో పూలు, అరటి తోరణాలతో అలంకరించారు. కొత్త ఏడాది మొదటి రోజు సుమారు 70వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా వేస్తున్నట్లు ఈఓ చెప్పారు. వీఐపీలు వస్తే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశాలను ఇప్పటికే అధికారులకు సూచించామన్నారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించామన్నారు.

నేటి నుంచి ప్రత్యేక దర్శనం..

యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లల తల్లులకు బుధవారం నుంచి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్ రావు పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి 11.30గంటల మధ్యలో, సాయంత్రం బ్రేక్ దర్శనం పూర్తయిన తర్వాత 5గంటల నుంచి 5.30గంటల సమయంలో దివ్యాంగులు, చంటిపిల్లలు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం చేయిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూర్పు ద్వారం ముందు ప్రత్యేక షెడ్డులో కూర్చోబెట్టి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు.

'రీజినల్' భూనిర్వాసితులకు అండగా నిలుస్తాం

- రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్



రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులు

చౌటుప్పల్: రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులు మంగళవారం కె. లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎలాంటి భూసేకరణ జరగకముందే టెండర్లు అంటూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని భూనిర్వాసితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి 40 కిలోమీటర్ల దూరంలో రీజినల్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలనే నిబంధనను తుంగలో తొక్కారని ఆరోపించారు. రీజినల్ రింగ్‌రోడ్డు మూలంగా చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ మున్సిపాలిటీలు ముక్కలుముక్కలుగా మారుతున్నాయని తెలిపారు. కొంతమంది వ్యక్తులతో పాటు పరిశ్రమల కోసం వందలాది మంది రైతులు, పేద ప్రజలను రోడ్డుపాలు చేయొద్దని వేడుకున్నారు. ఈ సందర్భంగా కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులకు ఇచ్చేందుకు నిర్ణయించిన పరిహారం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలను పోల్చి పరిహారం ఇవ్వడం సమంజసమన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూనిర్వాసితుల సంఘం కన్వీనర్, స్థానిక సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, ప్రతినిధులు గుజ్జుల సురేందర్ రెడ్డి, దబ్బటి రాములు, సందగళ్ల మల్లేష్‌గౌడ్, జాల వెంకటేష్, జాల శ్రీశైలం, పంకర్ల యాదయ్య, జాల మైసయ్య, జాల నర్సింహ, వల్లూరి బోవయ్య, జాల జంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.















ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

చౌటుప్పల్: జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ విషయంపై సుప్రీం కోర్టు ఆదేశించినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో మంగళవారం ఐద్వా జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయం, ఆహార భద్రత, పౌష్టికాహార పంపిణీ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టిసారించాలన్నారు. నిత్యావసర ధరలను తగ్గించాలన్నారు. ఈ అంశంపై వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టనున్నామని, ఇందులో వెల్లడైన అంశాలతో కూడిన నివేదికను ఆయా జిల్లాల కలెక్టర్లకు అందజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, కల్లూరి నాగమణి, మల్లేపల్లి లలిత, అండాలు, శారద, సోని, సువర్ణ, లక్ష్మమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా నడవాలి

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క



రంగవల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విమలక్క

భువనగిరిటౌన్: సామాజిక న్యాయం సాధించడం కోసం దళిత, బహుజన శక్తులు కలిసికట్టుగా నడవాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. ప్రజా ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన రంగవల్లి 65వ జయంతిని భువనగిరి పట్టణంలోని పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విమలక్క ముఖ్యఅతిథిగా హాజరై రంగవల్లి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. అణిచివేతకు గురైన కులాలన్నీ సజాతీయులు అయినప్పటికీ వారంతా ఒకటి కాదని, అందులో ఉన్న వర్గాలకు ఫలితాలు దక్కడానికి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పంచుకోవడం న్యాయమైనదని పేర్కొన్నారు. అందుకే మాల మాదిగలు వర్గీకరణను అంగీకరించి అంటరానితనం, భూమి పంపిణీ లాంటి ఉమ్మడి అంశాలపై కలిసికట్టుగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కోశాధికారి భాస్కర్‌నాయక్, దళిత ఐక్యవేదిక కన్వీనర్ బట్టు రామచంద్రయ్య, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురపంగ శివలింగం, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌నాయక్, మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవేందర్ మాదిగ, బస్వాపురం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు దాములూరి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి క్షేత్రాన్ని సందర్శించిన విదేశీ బౌద్ధ పరిశోధకులు



ఫణిగిరిలోని మ్యూజియంలో గల బౌద్ధ సంపదను గురించి బౌద్ధ పరిశోధకులకు వివరిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

నాగారం : నాగారం మండలంలోని ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని మంగళవారం న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన బౌద్ధ పరిశోధకులు ప్రొఫెసర్ సారా, ప్రొఫెసర్ జాఫ్రీషా సందర్శించారు. ఈ సందర్భంగా రెండు వేల ఏళ్ల నాటి ఫణిగిరి బౌద్ధ చరిత్ర, బౌద్ధ స్థూపాలు, చైత్యగృహాలు, శిలామండపాలు, విహారాలు, స్థానిక ప్రదర్శనశాలలోని సిద్ధార్థుని జననం, మహాభినిష్క్రమణం, జాతక కథలు, బుద్ధుని శిల్పాల గురించి పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ, బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. క్రీ.పూ 1 నుంచి క్రీ.శ 4వ శతాబ్దం మధ్య ఫణిగిరి గొప్ప బౌద్ధ క్షేత్రంగా విలసిల్లిందని ఆయన వారికి చెప్పారు. అనంతరం విదేశీ బౌద్ధ పరిశోధకులు మాట్లాడుతూ ఫణిగిరి బౌద్ధ శిల్పాలు అద్భుతమన్నారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రం పురాతనమైన, గొప్ప చారిత్రక ప్రాంతమని కొనియాడారు. అనంతరం ఫణిగిరి గుట్టపై ఉన్న ప్రాచీన బౌద్ధసంపద, శిల్పాలు, మహాస్థూపాలు, విహారగదులు, శిలాస్థావరాలు, బుద్ధుడి జాతక కథలు పరిశీలించారు. మ్యూజియంలో భద్రపర్చిన బౌద్ధసంపదను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు నర్సింహారావు, పురావస్తుశాఖ సిబ్బంది వీరయ్య, యాకయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

సుధా బ్యాంక్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



సుధా బ్యాంక్ చైర్మన్, ఎండీకి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న ఆలపాటి శివయ్య

సూర్యాపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆరు శాఖలు కలిగి ఉండి, 25వ వసంతంలోకి అడుగుపెట్టిన సుధా బ్యాంక్ ఐఎస్‌ఓ సర్టిఫికెట్ సాధించింది. మంగళవారం సూర్యాపేటలోని సుధా బ్యాంకులో హైమ్ అంతర్జాతీయ సర్టిఫికేషన్ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ ఆలపాటి శివయ్య ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ.. బ్యాంక్ ఎండీ, సిబ్బంది, పాలకవర్గం పనితీరు రిజర్వు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా అన్నీ పాలసీలను, సర్క్యులర్స్‌ను పాటిస్తుండడంతో ఐఎస్‌ఓ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సర్టిఫికెట్ అత్యుత్తమ సాంకేతికత, సృజనాత్మకత, నవ్యత కలిగి ఉన్న శాస్త్ర పరిశోధన, ఫార్మా, హాస్పిటల్స్‌కు ఇస్తామని తెలియజేశారు. అనంతరం బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ.. సుధా బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు, నూతన సంవత్సర వేడుకలతో పాటుగా ఐఎస్‌ఓ సర్టిఫికెట్ ఈ రోజే రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 25 సంవత్సరాలుగా తమ బ్యాంకు ఎన్నో సేవలు అందిస్తూ ముందుకు సాగుతుందన్నారు. అనంతరం బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, డైరెక్టర్లు బొనగిరి భాస్కర్, శంకర్‌లాల్, ఏపూరు శ్రవణ్‌కుమార్, కక్కిరేణి చంద్రశేఖర్, బాణావత్ సుజాత, డాక్టర్ మీలా సందీప్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, వస్త్ర వ్యాపారి గండూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.





32 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

చిలుకూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. చిలుకూరు ఎస్ఐ రాంబాబుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు సీతాపతి ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ చేసి ఆంధ్రాకు తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు సీతాపతి ఇంటి వద్దకు వెళ్లగా.. మినీ ట్రావెల్లర్ బస్, స్కార్పియో కారులో రేషన్ బియ్యం లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. నారాయణపురం గ్రామానికి చెందిన కందుకూరి కోటయ్య, కందుకూరి శ్రీను, చడపంగు వెంకటేశ్వర్లుతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడుకు చెందిన కుంభ కోటేశ్వరరావు, పాలపతి వెంకటేశ్వరరావు, చెవుల శ్రీను, వెంకటనాగేశ్వరరావు, తాతిరెడ్డి అంజితరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తం 64 బస్తాల్లోని 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కోదాడ సివిల్ సప్లై అధికారి రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కోదాడ సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

ట్రాఫిక్ పోలీసులకు ఫేస్ కెమెరాలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ఫేస్ కెమెరాలో రికార్డు చేస్తున్న ట్రాఫిక్ సీఐ కృష్ణ (ఇన్‌సెట్‌లో) సీఐ మెడలోని ఫేస్ కెమెరా

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని ట్రాఫిక్ పోలీసులకు ఉన్నతాధికారులు ఫేస్ కెమెరాలను మంగళవారం అందించారు. సీఐతో పాటు ఎస్ఐకి రెండు కెమెరాలను మెడలో వేసుకునే విధంగా తయారుచేసి ఇచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి ముఖం ఈ కెమెరాలో రికార్డవుతుంది. పట్టుబడిన వ్యక్తులు కోర్టులో హాజరైన సమయంలో అబద్ధాలు చెబితే.. కెమెరాలో రికార్డయిన ఫుటేజీని జడ్జికి సమర్పించే అవకాశం ఉంది. మంగళవారం రాత్రి యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా, గుండ్లపల్లి శివారులో, తుర్కపల్లి, ఆలేరులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టినట్లు ట్రాఫిక్ సీఐ కృష్ణ వెల్లడించారు.



దాడి చేసిన కేసులో ఐదుగురికి జరిమానా

చివ్వెంల(సూర్యాపేట): ఇద్దరు వ్యక్తులపై అకారణంగా దాడి చేసి గాయపర్చిన ఐదుగురికి జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత మంగళవారం తీర్పు వెలువరించారు. నూతన్‌కల్ మండలం తాళ్ల సింగారం గ్రామానికి చెందిన జులూరి సతీష్, జులూరి రాజేష్ 2017లో ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో తమ స్నేహితుడి వివాహానికి హాజరై అక్కడ భోజనం చేస్తుండగా.. సూర్యాపేటలోని మామిళ్లగడ్డకు చెందిన బత్తులసాయి, కోడి సాయి, పప్పుల ప్రవీణ్ కుమార్, బెజవాడ రాజేష్, బింగి ముఖేష్ అకారణంగా రాజేష్, సతీష్‌పై దాడి చేసి గాయపర్చారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ పి.హరికృష్ణ దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి ఈ కేసు తుది విచారణలో భాగంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలత నాయుడు వాదనలతో ఏకీభవిస్తూ నిందితులకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే ఏడు రోజుల శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కోర్టు కానిస్టేబుల్ చైతన్య సహకరించారు.

సహకార సంఘం క్లర్క్ సస్పెన్షన్

నడిగూడెం: మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం సహకార సంఘంలో క్లర్క్‌గా పనిచేస్తున్న బక్కయ్య కొద్దిరోజులుగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుండడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీంతో ఆయనని మంగళవారం సస్పెండ్ చేస్తూ తీర్మానం చేసినట్లు సంఘం చైర్మన్ గోసుల రాజేష్ తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరి మండలం రాయగిరిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం పథకం కింద పనిచేస్తున్న ఏజెన్సీలకు బిల్లులు మంజూరు చేయించే విధంగా కృషి చేస్తామన్నారు. టెన్త్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తే వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యేతో సన్మానించడంతోపాటు, విద్యార్థులకు సైకిళ్లు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. రుచికరంగా వంట చేసిన ఏజెన్సీ సభ్యురాలు కవితను శాలువాతో సన్మానించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు అండాలు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్